ప్రజాశక్తి

ఆదివారం 12 నవంబరు 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విద్యాధరపురం లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణాలు

బాణాసంచా నిల్వలు, అమ్మకాలపై నిఘా

- నగరంలో మూడు చోట్ల విక్రయ కేంద్రాలు

ప్రజాశక్తి - విజయవాడ, భవానీపురం : దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా నిల్వలు, అమ్మకాలపై అధికారులు నిఘా పెట్టారు. అక్రమంగా నిల్వ చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఆదివారం జరిగే దీపావళి పండుగ నేపథ్యంలో నగరంలోని మూడు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో అధికారికంగా సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 8 దుకాణాలు, విద్యాధరపురం లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్‌లో సుమారు 41 దుకాణాలు (మిగతా 6లో)

అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ

- మురుగు నిర్వహణలో విఎంసి విఫలం
- సమగ్ర ప్రణాళిక రూపకల్పన, అమలులో నిర్లక్ష్యం
- శిధిలావస్థలో మ్యాన్‌హోల్స్ పైకప్పులు
- చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగు నీరు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ నగరంలో మురుగు నీటి కాల్వల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. డ్రెయిన్లతో పాటు మ్యాన్ హోల్స్ నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించడంలోను, దాని అమలు చేయడంలోను విఎంసి వైఫల్యం చెందింది. మరో వైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పరిశుభ్రమైన నగరం(క్లీన్డ్ సిటీ)గా అగ్ర స్థానాల్లో నిలుస్తోందని అధికారులు చెబుతోన్న మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండటం లేదు. దీంతో నగరంలో మురుగు నీటి కష్టాలు మురుగు నీటి కష్టాలు ఎప్పటికి తీరేనో అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఏప్రిల్ 1888 ఏప్రిల్1న తొలిసారిగా విజయవాడ మునిసిపాలిటిగా ఏర్పాటు చేశారు. తర్వాత 1960లో సెలక్షన్ గ్రేడ్ మునిసిపాలిటీగా అప్ గ్రేడ్ చేశారు. అనంతరం 1981లో మునిసిపల్ కార్పొరేషన్‌గా అవతరించింది. విజయవాడ చుట్టుపక్కల ఉన్న గుణదల, పటమట, భవానీపురం గ్రామ పంచాయతీలతో పాటు పాయకాపురం, కుండవారి కండ్రిగ గ్రామాలను 1985లో విలీనం చేశారు. దీంతో విఎంసి విస్తీర్ణం 61,88 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. అయితే అండర్ గ్రౌండ్ వ్యవస్థ నాటి నుంచి సమస్యగానే నెలకొంది. దీంతో 1967-68లో 35 శాతం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకం కింద రూ. 271.48 కోట్లతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. మరో సారి 2007లో భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం నిమిత్తం దాదాపు రూ. 175 కోట్లు ఖర్చు చేశారు. అయినా పూర్తి స్థాయిలో డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వడంలో వైఫల్యం చెందారు. డ్రైనేజీ కనెక్షన్‌ల సౌకర్యం కలిగిన వాటి కంటే లేని ఇళ్ల సంఖ్యే అధికంగా ఉంది. విఎంసి పరిధిలో ప్రస్తుతం 1.01 లక్షల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్‌లు కలిగిన గృహాలు ఉండగా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కనెక్షన్‌లు లేని ఇళ్లు1.09 లక్షల వరకు ఉన్నాయి. దీనికి తోడు 2016లో రూ. 461 కోట్లతో దాదాపు 425కిమీ పొడవునా

ఇటీవల ముత్యాలంపాడు టీచర్స్ కాలనీ మొదటి లైన్లో డ్రైనేజీ పగిలి రోడ్డుపైకి చేరిన మురుగునీరు

చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో పనులు జరక్క పోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా (మిగతా 6లో)

వార్త మెయిన్‌లో

చంద్రమోహన్ మృతితో పమిడిముక్కలలో విషాదఛాయలు

ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయండి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 15న విజయవాడ సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. విజయవాడ రైల్వే స్టేషన్ మెయిన్ గేట్ గడియారం స్తంభం వద్ద ఆటో స్టాండ్ కార్మికుల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. అధిక ధరలను అరికట్టాలని, ప్రభుత్వ రంగ

రైల్వేస్టేషన్ వద్ద ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు ఆపాలని కోరుతూ జరిగే బహిరంగ సభలో ఆటో కార్మికులు పెద్దఎత్తున (మిగతా 6లో)

జీతాలివ్వండి మహాప్రభో!

- ఆర్‌డబ్ల్యుఎస్ స్కీం కాంట్రాక్టు కార్మికుల ఆకలి కేకలు
- 30 నెలలుగా అందని వేతనాలు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కరెంటు బిల్లులు పెరిగాయి... పెట్రోలు, డీజిల్, గ్యాస్‌తోపాటు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి... దీంతో పెరిగిన కుటుంబ ఖర్చులతో నెలనెలా జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులను, అంతో ఇంతో ఆసరా ఉన్న మధ్యతరగతి ఆదాయ వర్గాల వారు కలవరపడుతున్నారు. ఈ నేపథ్యంలో 30 నెలలుగా జీతాలు సకాలంలో అందకపోవడంతో చిరుద్యోగులైన ఆర్‌డబ్ల్యూఎస్ మల్టీ విలేజ్ స్కీం కాంట్రాక్టు వర్కర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే అనేక మంది అప్పుల పాలయ్యారు. జీతాలు (మిగతా 6లో)

వేతనాలు ఇవ్వకుంటే ఆందోళనలు

మర్రాపు పోలినాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి

జీతాల కోసం కార్మికులతో కలిసి యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్, జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించాం. స్పందనలో మూడుసార్లు ఇచ్చాం. అయినా జీతాలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఇంకా ఆలస్యం చేస్తే ఆందోళనకు దిగుతాం.

జీతాలివ్వకపోతే పస్తులే

కె.శివసుబ్రహ్మణ్యం, వర్కర్, కమ్మనమోలు, నాగాయలంక మండలం

జీతాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. రావాల్సిన జీతం లక్షల్లో బకాయి ఉంది. అప్పులు ఇచ్చే వారు కూడా ముఖం చాటేస్తున్నారు. కిరాణా కొట్లలోనూ పరపతి పోతోంది. జీతాలు రాకుంటే కుటుంబం పస్తులుండాలి.

అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయి

బి.సురేష్‌కుమార్, రామచంద్రాపురం, అవనిగడ్డ మండలం

నాకు ఆర్థిక స్థోమత లేదు. అందుకే జీతాలు తక్కువైనా స్కీంల్లో కాంట్రాక్టు పనులు చేస్తున్నాం. జీతాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. నెలనెలా జీతాలు అందక అప్పులు చేశాం. వడ్డీలు పెరిగిపోతున్నాయి.

జర్నలిస్ట్ చంద్ర ఆత్మహత్య

కుమారుడి కళాశాల ఫీజు చెల్లించలేకపోయానని సూసైడ్ నోట్

ప్రజాశక్తి - చల్లపల్లి : కుమారుడి కళాశాల ఫీజు చెల్లించలేక కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన సిటీ కేబుల్ జర్నలిస్ట్ కళ్లేపల్లి చంద్ర (సిటీ కేబుల్ చంద్ర) (45) ఆత్మహత్య చేసుకున్నారు. చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తన కుమారుడి కళాశాల ఫీజు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసిన (మిగతా 6లో)

'పల్లెకు పోదాం' ద్వారా

ప్రజలను చైతన్యవంతులను చేయండి

అధికారులకు కలెక్టర్ డిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : పేద బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వీటిని ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులుగా చేసేందుకు ఏర్పాటు చేసిన 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. 'పల్లెకు పోదాం' కార్యక్రమంపై ఆయన శనివారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్లో

కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ఐదుగు బలహీన వర్గాల వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు ఏ (మిగతా 6లో)

ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు

భద్రత ఏర్పాట్లు చేసిన పోలీసులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు అయ్యే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) గుర్తించి బ్యారికేడ్స్, డ్రమ్స్, కోన్స్ ఏర్పాటు చేసినట్లు నందిగామ సిఐ హనీష్ శనివారం తెలిపారు. ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు, రూరల్ డి.సి.పి అజిత్ వెజెండ్ల పర్యవేక్షణలో నందిగామ ఎసిపి జనార్ధన నాయుడు ఆధ్వర్యంలో నందిగామ సిఐ హనీష్ నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏర్పాట్లు చేసి నట్లు తెలిపారు. శనివారం ఎ ఎస్ పి నందిగామ ఎసిపి జనార్ధన్ నాయుడు బ్యారికేడ్స్, డ్రమ్స్, కోన్స్ పరిశీలించారు.

14 బాణాసంచా దుకాణాలు

దుకాణాలను పరిశీలిస్తున్న సిఐ హనీష్

ప్రజాశక్తి - నందిగామ : దీపావళి సందర్భంగా నందిగామ పట్టణంలో 14 షాపులకు దీపావళి బాణా సంచా అమ్ము కోవడానికి అధికారులు అనుమతులు ఇవ్వటంతో నందిగామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాణాసంచా షాపులు శుక్రవారం రాత్రి నుండి ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఆఫీసు స్థలంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలను సీఐ హనీష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నందిగామ సీఐ హనీష్ మాట్లాడుతూ ప్రతి దుకాణాదారునికి పలు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి షాపునకు ఫైర్ ఎస్టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని, వాటర్ ట్యాంకులను అందుబాటులో ఉంచాలని సూచించారు. తొక్కిసలాట జరుగకుండా ఎంట్రన్స్, ఎగ్జిట్ ద్వారాలను విడివిడిగా ఏర్పాటు చేశామని అన్నారు.

గంపలగూడెంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అబుల్‌కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయవాడలో జరుగుతున్న కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గం నుండి ముస్లిం సోదరులు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎంఎల్ఎ సామినేని ఉదయభాను ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రన్ హుసేన్, పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షులు షేక్ మోహిద్దిన్, ముస్లిం సోదరులు తదితరులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. **గంపలగూడెం :** మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గంపలగూడెం, పెనుగలను, గ్రామాల్లో గల గ్రంథాలయ శాఖల్లో ఈ వేడుకలు నిర్వహించినట్లు ఆయా ఇన్‌ఛార్జిలు శ్రీలత, నాగేశ్వరరావు తెలిపారు. మొదటగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - నందిగామ : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటాం అన్న వైసిపి ప్రభుత్వం మాట తప్పిందని నందిగామ మండల తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అగ్రిగోల్డ్ బాధితులను వారంరోజుల్లో రూ.1,350 కోట్లు విడుదల చేసి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని, హామీ విస్మరించారని తెలిపారు.

దేవస్థానంలో గాజుల అలంకరణ మహోత్సవం

దుర్గగుడిలో కర్ణాటక డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో గాజుల అలంకరణ మహోత్సవం సందర్భంగా శ్రీ అమ్మవారి అలంకరణ నిమిత్తం చిన్న గాజులతో తయారు చేసిన 1-హారం (అపరాజిత దేవికి), 1-హారం (కనక దుర్గ అమ్మవారికి), పూల జడలు, అష్టలక్ష్మి(8) అమ్మవార్లకు గాజుల సెట్లు విలువ సుమారు రూ.20 వేలు, ప్రధానాలయం అలంకరణకు సుమారు రూ.2.50లక్షలకు పైగా విలువ చేసే గాజులను శ్రీ కనకదుర్గ లలితా పారాయణ బృందం శ్రీయుత ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీ కర్నాటి రాంబాబును కలిసి అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న కర్ణాటక డిప్యూటీ సిఎం

దుర్గమ్మను కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ శనివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

ధన త్రయోదశి సందర్భంగా దుర్గగుడిలో శ్రీ మహాలక్ష్మీ యాగం

దుర్గమ్మ దేవాలయంలో శనివారం ధన త్రయోదశి సంధర్భంగా రుద్రహోమం వద్ద యాగశాలలో ఆలయ వైదిక సిబ్బంది, అర్చక బందంచే వేదపండితుల వేదమంత్రోచ్చారణాల నడుమ శ్రీ మహాలక్ష్మీ యాగం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ మహాలక్ష్మీ యాగంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు యాగాన్ని విశేషముగా తిలకించారు.

బాలుడి కుటుంబానికి రూ.5 లక్షలు

మృతిచెందిన బాలుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈనెల 8వ తేదీన పాత రాజరాజేశ్వరి పేట రైల్వే పట్టాల కింద ఉన్న అవుట్ ఫాల్ డ్రైన్‌లో పడి మృతిచెందిన బాలుడు సులేమాన్ అష్రఫ్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. మతి చెందిన బాలుడి కుటుంబానికి జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల విలువ గల చెక్కును 10వ తేదీ రాత్రి వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు చెక్కును అందించి తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వాసా ఆదినారాయణ బాబు, రబ్బానీ, గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులకు ప్రయాణికులు విజ్ఞప్తి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డిఎం జరిగింది. గంపలగూడెం మండలం నుండి భద్రాచలంకు, హైదరాబాదుకు బస్సు సర్వీసులు నడపాలని ప్రయాణీకులు కోరారు. తిరువూరు నుండి గానుగపాడు-కొత్తూరు మీదుగా విజయ వాడకు బస్ సర్వీసు, తిరువూరు నుండి హైదరాబాదుకు ఉదయం వేళల్లో సర్వీసులు, మచిలీపట్నంకు సాయంత్రం 4 గంటలకు బస్సులు నడపాలని పలువురు కోరారు. పామూరుకు రెండో సర్వీసు, తిరువూరు నుంచి మెహిదీపట్నం, గచ్చి బౌలి, బిరంగూడ మీదుగా బీహెచ్ఇఎల్ సర్వీసు నడపాలని కోరారు. ఉన్నతాధికారులకు తెలియపరచి నిర్ణయం తీసుకుంటామని డిఎం వేణు తెలిపారు.

విశ్వరూప మహాసభకు తరలిన మాదిగలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో మందా కష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభకు రెడ్డిగూడెం మండలం నుంచి ఎంఆర్‌పిఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కదిలి వెళ్లారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభలో ఎస్సీ వర్గీకరణ పై కీలకమైన ప్రకటన చేసే అవకాశం ఉందని ఎంఆర్పీఎస్ నాయకులు చెబుతున్నారు.

నందిగామలో...

విజయవాడలో...


రెడ్డిగూడెంలో...

ప్రజారక్షణ భేరి దృష్టికి సమస్యలు

15న బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి - నందిగామ : నవంబర్ 15 ప్రజా రక్షణభేరి సభను జయప్రదం చేయాలని శనివారం నందిగామ మండలం రాఘవాపురం, కమ్మవారిపాలెం, పల్లగిరి, అనాసాగరం, డి.వి.ఆర్.కాలనీ, ఉమాకాలనీ, గాంధీ సెంటర్, రైతుపేట, చందాపురం, కేతవీరునిపాడు, అంబారుపేట తదితర గ్రామాలలో సిపిఎం ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఓడించాలని, బిజెపికి కొమ్ము కాసే పార్టీలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాగు చేస్తున్న పంటకి సాగునీరు లేక ఎండిపోతున్నాయని రైతులు జాతాలో సిపిఎం దృష్టికి తీసుకువచ్చారు. 30 సంవత్సరాల నుంచి రాఘవపురం కొండ పోరంబోకు సాగు చేసుకుంటున్నా పేదలకు పట్టా ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని తెలిపారు. నందిగామ టౌన్‌లో 17,18 వార్డుల్లో డ్రైయిన్లు లేక నీళ్లు రోడ్లపైకి వచ్చి ఉంటున్నాయని స్థానికులు జాతా దృష్టికి తెచ్చారు. అనంతరం పట్టణంలో పురవీధుల్లో తిరుగుతూ బైక్ ర్యాలీ మైక్ ప్రచారంతో చందర్లపాడు బస్టాండ్ దగ్గర సభ, రైతు పేటలో సభ గాంధీ సెంటర్లో ముగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ కమిటీ సభ్యులు, కరి వెంకటేశ్వరరావు, వి.రవిశేఖర్, తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** ఈ నెల 15న జరిగే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ పటమట బెంజిసర్కిల్ వద్ద శనివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు సిటీ కార్యదర్శి బి.బెనర్జీ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా రక్షణ భేరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున ప్రతి ఒక్కరూ తమ పనిని మానుకుని హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంకలో ఎన్.కోటబాబు, వి.బి.రాజు, డి.వెంకన్న పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కార్మిక హక్కుల పోరాటాలకు అండగా నిలిచే సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో నవంబర్ 15న జరగనున్న ప్రజా రక్షణ భేరీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు మిడ్డేమీల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ సిఐటియు జనరల్ బాడీ సమావేశం శనివారం కామ్రేడ్ వెలగా లక్ష్మణరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎ.పి మధ్యాహ్నం భోజన పథకం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, ఇబ్రహీంపట్నం మిడే మిల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ కుంచం రాజేశ్వరి, వర్కర్స్ మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** సిపిఎం ప్రజా రక్షణ భేరి చలో విజయవాడ నవంబర్ 15 జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా బైక్ జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడారు. రానున్న 2024 సంవత్సరంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో చరం గీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోట కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** ఈ నెల 15న విజయవాడ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో సిపిఎం ఆధ్వర్యంలో జరగబోయే ప్రజారక్షణభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ రెడ్డిగూడెం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఎం.మాధవరెడ్డి మాట్లాడారు. ఈ గోడ పత్రికను ఆవిష్కరించిన వారిలో సిపిఎం నాయకులు ఉయ్యూరు కష్ణారెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు కొండపల్లి పరమేశ్వరరావు ఉన్నారు. **పెనుగంచిప్రోలు :** విజయవాడలో సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండల సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం 65న నెంబర్ జాతీయ రహదారి కొణకంచి అడ్డరోడ్డు వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రాంబాబు, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో...

జగ్గయ్యపేటలో...

పెనుగంచిప్రోలులో...

అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు అనుసరణీయం : కలెక్టర్

కలెక్టరేట్‌లో ఆజాద్‌చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

గుడివాడలో నివాళులర్పిస్తున్న మునిసిపల్ కమిషనర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మహనీయుడని, ఆయన ఆశయాలు అనుసరణీయమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కొనియాడారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం వేడుకలు శనివారం జిల్లా ప్రధాన కేంద్రం మచిలీపట్నంలో జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్, మైనార్టీ నాయకులు ప్రభృతులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న మతాలు సంస్కృతులు కలిగి ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటే అంటూ హిందూ ముస్లిం ఐక్యతకు కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, విద్య ప్రాధాన్యతను గుర్తించి, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని చాటి చెప్పిన గొప్ప దార్శనికుడని అన్నారు. రాష్ట్ర బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ బి.సత్యనారాయణ సింగ్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కె. రాంబాబు, క్రిస్టియన్ కార్పొరేషన్ డైరెక్టర్ జానీ, ఆర్డీవో ఎం వాణి, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** స్థానిక వైసిపి కార్యాలయం వద్ద అబుల్ కలాం చిత్రపటానికి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, మండల యూత్ నాయకులు చింతలపూడి బాలు, పార్టీ నాయకులు గరికిపాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని కమిషనర్ మురళీకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ డే బేసిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.....

మదర్సా యాకోబియా స్కూల్ , నేషనల్ ఎడ్యుకేషన్ డే బేసిక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలీ, సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి లు పాల్గొని విద్యార్థులకు పలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజుద్దీన్, రహీం, తాహిర్ భాష, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మానవతా ఆధ్వర్యంలో......

మానవతా ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా అధ్యక్షులు పొట్లూరి వీర శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి సీతాల ప్రసాద్, కోశాధికారి వడ్డీ రాజేశ్వరరావు, గుడివాడ అధ్యక్షులు దండమూడి జయలక్ష్మి, వైస్ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు, సభ్యులు చంద్రశేఖర్, కోన రామారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - ఉంగుటూరు :** అబుల్ కలాం ఆజాద్ జయంతిని స్థానిక ఎండిఒ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయనచిత్రపటానికి ఎండిఒ శేషగిరిరావు, ఇతర అధికారులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండిఒ మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో సుదీర్ఘంగా 11 సంవత్సరాల పాటు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా పనిచేసి దేశంలో విద్యా సంస్కరణలకు విశిష్ట కృషి చేశారని అన్నారు. మౌలానా చేసిన సేవలకు గుర్తుగా 1992లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ఇచ్చి గౌరవించిందని, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగవరపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ షేక్ పెదనాగూర్ పాల్గొన్నారు.

డాక్టర్ సమరంను సన్మానిస్తున్న పుట్టగుంట సతీష్ కుమార్,తదితరులు

డాక్టర్ సమరంకు సన్మానం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా డాక్టర్ జి.సమరం సమాజానికి అందించిన సేవలు అభినందనీయమని పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ చైర్మన్, లయన్, డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు.రెడ్ క్రాస్ సంస్థ ద్వారా విశేష సేవలను అందించిన్న డాక్టర్ సమరం కు ఇటీవల ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్న సందర్భంగా హనుమాన్ హనుమాన్ జంక్షన్ లోని తన ఫామ్ హౌస్ లో డాక్టర్ సమరం ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పుట్టగుంట మాట్లాడుతూ కరోనా సమయంలో సైతం తన ప్రాణాలను పణంగా పెట్టి నిస్వార్థంగా సేవలు అందించిన డాక్టర్ జి సమరం బావితరాలకు ఆదర్శంగా నిలిచారని గత 50 సంవత్సరాలకు పైగా డాక్టర్ సమరం చేస్తున్న సేవలు నిరూపమానమని ప్రశంసించారు. ఒకపక్క డాక్టర్ గా మరో పక్క సమాజానికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వై ఎస్ ఆర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. డాక్టర్ సమరం కు జరిగిన అభినందన సభలో విజయవాడకు చెందిన పలువురు డాక్టర్స్, లయన్స్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పి డి జి మిరియాల వెంకటేశ్వరరావు ,డాక్టర్ బుచ్చిబాబు ,రామిశెట్టి కొండలరావు , దండమూడి స్టాలిన్ డాక్టర్ త్రిపురనేని త్రిపిర్నేని హరినాథ్ పద్మ, నందిగం స్వామి, లయన్స్ జిల్లా పి ఆర్ ఓ తాడి రంగారావు, అక్కినేని ఫణీంద్ర, లయన్ వేజెండ్ల ప్రతాప్, లయన్ భూమా సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు నింపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : దీపావళి సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

బోసిపోతున్న దీపావళి దుకాణాలు

ప్రజాశక్తి - మొవ్వ : ఈఏడాది దీపావళి కొన్ని గంటల వ్యవధిలో వస్తుండడంతో బాణాసంచా దుకాణాలు కొనుగోలు దారుల కోసం ఎదురుచూసే పరిస్థితి సంభవించింది. కేవలం శని, ఆదివారాలు రెండు రోజులు మాత్రమే విక్రయాలు సాగించాలని అధికారులు ఆదేశించడంతో దుకాణాలు తెరిచిన లైసెన్స్.దారులకు తొలి రోజు నిరాశే ఎదురైంది. మొవ్వ మండలంలో ఏడాది ఏటా కన్నా నాలుగుదుకాణాలకు అధికంగా లైసెన్స్ అందజేశారు. మండలంలో పెదపూడి, మొవ్వ, కోసూరు, కాజ, నిడుమోలు గ్రామాలలో వీటిని ఏర్పాటు చేశారు. అయితే రెండు రోజులు క్రితం వరకు కురిసిన వర్షాలతో రైతులు ఇబ్బందులు పాలవడం కూడా ఈ విక్రయశాలలకు గ్రహణం పట్టినట్టుగా భావిస్తున్నారు. దీనితో అధిక శాతం మందిలో దీపావళి బాణాసంచా కాల్చుకోవడానికి అంత ఆసక్తి చూపిస్తున్న దాఖలాలు కాన రాలేదు. ప్రతి దుకాణంలో 70 నుంచి 80 శాతం వరకు రిబేటు ఇస్తామంటూ పేర్కొంటున్నా గతంలో మాదిరిగా ఉరుకులు పరుగులు లేవు. లైసెన్స్ దారులు పండగ రోజైన ఆదివారం అమ్మకాల పైనే ఆశలు పెంచుకున్నారు.

కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు

ఆర్థిక సహాయం అందజేస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో గల బీసీ కాలనీకి చెందిన నాగిడి వెంకటరత్నం కుమార్తె శివగంగ దివ్యాంగురాలు కాగా ఆమెకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ 7 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఆ గ్రామానికి వెళ్లి శివగంగ కుటుంబాన్ని సందర్శించి గత కొద్ది రోజుల నుంచి మెడ నరాల వ్యాధితో బాధపడుతూ మంచం లో నుంచి లేవలేని దుర్భర స్థితిలో జీవనం సాగిస్తున్న శివ గంగను శ్యామ్ కిషోర్ పరామర్శించారు. అనంతరం ఆమెకు నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగిడి శివ నాగేశ్వరరావు, పాస్టర్ విలియం కేరి ,నాగిడి రాంబాబు, తమ్మ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇ-పలకలు పంపిణీ

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండలం పెదపూడి మండల పరిషత్ యూపీ పాఠశాలలో3,4,5 తరగతులకు చెందిన 37 మంది విద్యార్థులకు పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె నాగమోహనరావు అత్యంత విలువైన ఇ.స్లేట్‌లను పంపిణీ చేశారు. పల్లె చెంతకు ప్రపంచ విద్య చేరాలనే లక్ష్యంతో వీటిని పంపిణీ చేసినట్లు వివరించారు. అంతకు ముందుగా సూరంపల్లి లో 20 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. కరుణాకర్ రెడ్డి, సహ ఉపాధ్యాయులు, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయన కూచిపూడి లోని శ్రీసిద్ధేంద్ర యోగికూచిపూడి నాట్య కళాపీఠం ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, శ్రీ సిద్ధేంద్ర

ఓరియంటల్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నెమ్మాని శేష సాయి కుమార్, సంస్కృత ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్, గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపువెంకటేశ్వరఫణి కుమార్ తదితరుల ద్వారా కూచిపూడి విశిష్టతను తెలుసుకొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా హనుమాన్ జంక్షన్ కు చెందిన కనుమూరి రాజాబాబు నియమితులు కావడంతో ఈ ప్రాంతం రహదారుల అభివృద్ధి నిధులు మంజూరు చేయించారు. హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ రోడ్, విజయవాడ రోడ్ ,ఏలూరు రోడ్, నూజివీడు రోడ్డు అభివృద్ధికి జాతీయ రహదారుల సంస్థ నుండి 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు వారం రోజుల్లో టెండర్లు ఖరారు కానున్నట్లు రాజబాబు శనివారం వెల్లడించారు. రోడ్లు నిర్మాణం చేయటమే కాకుండా డ్రైనేజీ సిస్టం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

వీరవల్లి రైల్వేగేటుకు మరమ్మతులు పూర్తి

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : జాతీయ రహదారి నుంచి బాపులపాడు మండలం వీరవల్లి రంగన్నగూడెం, పారిశ్రామిక వాడికి వెళ్లే దారి మార్గంలోని రైల్వేగేటుని పది రోజులుగా మూసివేయగా రైల్వే సిబ్బంది మరమ్మతులు యుద్ధ ప్రాతిదికన పూర్తి చేసి శనివారం గేటు తెరిచి రాకపోకలకు అనుమతించారు. ఈనెల 4 నుంచి రైల్వే గేటు మూసి వేయడంతో స్థానికులు ప్రయాణికులు పలు ఇబ్బందుల్ని ఎదుర్కోగా దీనిపై బాపులపాడు మండల ప్రముఖులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు స్పందించి విజయవాడ రైల్వే డివిజనల్ ఇంజనీర్ మహంక్ ఉపాధ్యాయ దృష్టికి మూడు రోజుల క్రితం తీసుకెళ్లి గట్టిగా ప్రశ్నించడంతో ఆయన ఆదేశాలు మేరకు మరమ్మతులు చేసి రాకపోకలకు అనుమతించారు. గేటు తెరవడంతో నారాయణపురం, కొమ్మూరు, సింగన్నగూడెం, రంగన్న గూడెం, మల్లవల్లి గ్రామాల ప్రజలు, మల్లవల్లి పారిశ్రామిక వాడికి వెళ్లే ఉద్యోగస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ 2018 సంవత్సరంలోనే ఇక్కడ ఆర్.ఓ.బి నిర్మించమని అప్పటి రైల్వే మంత్రి పియుష్ గోయల్ కు, అప్పటి రైల్వే బోర్డు చైర్మన్ అశ్విని లోహానికి వినతిపత్రం అందించగా ఓవర్ బ్రిడ్జి నిర్మించడానికి వెలుసుబాటు ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసారని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.బి కి అయ్యే ఖర్చులో సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని తెలియచేశారన్నారు. దీనిమీద గత నాలుగు సంవత్సరాలుగా స్థానిక మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి స్పందించకపోవడం దారుణం అని, ఇటీవల మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి ప్రకటించిన మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని ఆర్.ఓ.బి అనుమతుల జాబితాలో వీరవల్లి ఆర్.ఓ.బి లేదని అన్నారు.

పాఠశాలలో చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బాయ్స్ హైస్కూల్ తరగతి గదిలో శనివారం భారీగా మంటలు చాలా రేగాయి. ఈ మంటలలో కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్టోర్ రూమ్ మొత్తం దగ్ధమైంది. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పాపారావు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

హార్పిక్ నూతన ఉత్పత్తులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హార్పిక్ పవర్ ప్లస్ పేరుతో సరికొత్తగా టాయిలెట్ క్లీనర్ నూతన ఉత్పత్తులను విజయవాడ నగరంలో ఆవిష్కరించినట్లు సంస్థ మేనేజర్ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న హార్పిక్ కన్నా సరికొత్తగా రూపొందించామని దీని వల్ల కేవలం అయిదు నిమిషాల్లోనే క్లీనింగ్ ఇస్తుందన్నారు. మాలోర్ కంట్రోల్ టెక్నాలజీ వల్ల దుర్వాసన లేకుండా చేస్తుందన్నారు. అంతేకాకుండా టాయిలెట్ మంచి సువాసనలతో ఉండేలా ఈ క్లీనర్ ఉపయోగపడుతుందని తెలిపారు. వినియోగదారులకు అవగాహన కలిగించేందుకుగానూ విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని ప్రతిష్టించాలి

విగ్రహాన్ని అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు కాకాని వెంకట రత్నం విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు కాకాని తరుణ్ విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా కాకాని తరుణ్ మాట్లాడుతూ 2018లో ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా తొలగించిన విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించాల్సిందిగా కౌన్సిల్‌లో తీర్మానించామని దీనికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ విగ్రహానికి సంబంధించి స్థల సేకరణ చేస్తున్నామని నగరంలో విగ్రహావిష్కరణ పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి అధ్యక్షులు గుమ్మడి రామకృష్ణ, ఆచార్య ఎన్‌జిరంగా ట్రస్టు అధ్యక్షులు గోగినేని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పండుగల సందర్భంగా గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఏర్పాటుచేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుందని, పండుగల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కూడా అందిస్తున్నామని నిర్వాహకులు కె.ఈశ్వర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ ప్రదర్శనలు కొన్ని ప్రధాన ప్రాంతాలకే పరిమితమైందని అయితే ఇటీవల కాలంలో విజయవాడతో పాటు, విశాఖ, టైర్ 2 నగరాలలో కూడా ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న మధ్య తరహా వ్యాపారస్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నామని, 80 శాతం మంది కస్టమర్లు షాపింగ్ చేయడంలో మంచి ఆదరణ లభిస్తుందన్నారు.

నూతన ఎంసిసిబి బాక్స్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఏ సమస్య ఉన్నా వెంటనే స్పందించే కౌన్సిలర్ కొండపల్లి మున్సిపాలిటీ ఐదో డివిజన్ కౌన్సిలర్ మొగిలి దయ మరొకసారి తన వార్డులోని సమస్యకు పరిష్కారం చూపారు. కొండపల్లి మున్సిపాలిటీ ఐదో డివిజన్ గీత మందిర్ రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్‌కి పక్కన ఒక గృహాన్ని నిర్మించుకుంటున్నారు. వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు విషయాన్ని ఎలక్ట్రికల్ ఏఈకి తెలిపి ట్రాన్స్‌ఫార్మర్‌ని పైకి పెట్టించారు. కొద్ది రోజుల కిందట ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ని ఆనుకుని ఎం.సి.సిబి బాక్స్ గహానికి దగ్గరగా ఉండటంతో మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగా ఎంసిసిబి బాక్స్ ఏర్పాటు చేశారు. ఈ బాక్సును మొగిలి దయ శనివారం ప్రారంభించారు. స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతోనే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడలు చదువులో ఒక భాగమని, క్రీడలలో పాల్గొనడ ద్వారానే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి చెందుతాడని నూజివీడు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) ఈడా అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. నిత్యం చదువుతో కుస్తీపట్టే వారికి ఆటలు మానసికోల్లాసాన్ని ఇస్తాయనిన తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల తల్లిదండ్రులలో ఆటలపై అవగాహన పెరగడం ముదావహమన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ), ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల అండర్ - 19 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ కమ్ స్టేట్ టీమ్ సెలెక్షన్స్‌ను డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. అంతకుముందు 13 ఉమ్మడి జిల్లల నుంచి వచ్చిన రెజ్లింగ్ క్రీడాకారుల నుంచి అతిథులు గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలలోనూ ప్రావిణ్యం సంపాదించాలని సూచించారు. అన్ని రంగాలలోనూ ప్రావిణ్యం ఉంటే, ప్రపంచంలో ఎక్కడైనా రాణించే అవకాశం ఉంటుం దన్నారు. విజయవాడ రూరల్ మండల జడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, విజయవాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత వరుసగా ఐదోసారి రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా ఆతిథ్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ కూడా క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. నున్న జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి సిఎస్ఎస్ఎన్ రెడ్డి, స్కూల్ గేమ్స్ అండర్ - 19 కార్యదర్శి వి రవికాంత పాల్గొన్నారు.

బిసి డిలుగా నగరాలు : సిఎంకు కృతజ్ఞతలు

పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లో కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్న నగరాల కులాన్ని బీసీ-డిగా గుర్తించి, రాష్ట్రం అంతటా వర్తించేలా అధికారిక జిఒ విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, పశ్చిమ ఎంఎల్ఎ వెలంపల్లి శ్రీనివాసరావుకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కులస్తులు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చిట్టినగర్‌లో గల నగరాల కళ్యాణ మండపంలో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వెనుకబడిన నగరాల కులంలో ఈరోజు నుంచి ప్రభుత్వ పథకాలు గాని అన్నిటికీ అర్హత సాధించేలా ప్రభుత్వం గుర్తించడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. స్టాండింగ్ కమిటీ మెంబర్ 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగరాల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు నగరాల సీతారామస్వామి అమ్మవార్ల దేవస్థానం కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల సంఘం శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల యువజన సంఘం కృష్ణాజిల్లా నగరాల సంఘం అర్బన్ నగరాల సంఘం నగరాల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు, నగరాల కులస్తులు పాల్గొని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కంచికచర్లలో

గంపలగూడెంలో...

విజయవాడలో...

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకూ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణ రావు తెలిపారు. 14న జరిగే గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ సభకు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా హాజరై వారోత్సవాలను ప్రారంభి స్తారని పేర్కొన్నారు. అదే రోజు కెబిఎన్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్పెల్‌బి, వక్తృత్వం పోటీలుంటాయని పేర్కొ న్నారు. 15న నగరంలోని విద్యాసంస్థలకు చెందిన 8,9,10 తరగతులకు విద్యార్థులకు స్పెల్‌బి, పోస్టర్ ప్రెజెంటేషన్, ఏకపాత్రాభినయం (మై బుక్ మై లైఫ్) క్విజ్ పోటీలు ఉంటాయని తెలిపారు. 16న నగరంలోని కళాశాల డిగ్రీ విద్యార్థులకు ట్రెడిషనల్ డ్రెస్ పోటీలు, ఏ బుక్ ఇన్‌స్పైర్ మి, వక్తృత్వం, క్విజ్ పోటీలుంటాయని పేర్కొన్నారు. 17న కెబిఎన్ కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులకు పుస్తక పరిచయం, ట్రెడిషనల్ డ్రెస్, వక్తృత్వం, క్విజ్ పోటీలుంటాయని పేర్కొన్నారు. 18న ముగింపు సభలో బహుమతి ప్రదానోత్సవం ఉటుందని వివరించారు. పోటీలకు సంబంధించిన మరింత సమాచారం కోసం లైబ్రరీయన్ శ్రీనివాసరాజు ఫోన్ 9676685698కు సంప్రదించాలని కోరారు. **కంచికచర్ల :** కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా శాఖా గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేయ నున్నట్లు తెలిపారు **గంపలగూడెం:** మండలంలో గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రిక లను ఆవిష్కరించినట్లు స్థానిక గ్రంథాల య ఇన్‌చార్జ్ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. జరగనున్న ఈ వారోత్సవాల్లో పాఠకులు, విద్యార్థులు సమిష్టిగా పాల్గొని విజయవంతం చేయాలని నాగేశ్వరరావు కోరారు. **విజయవాడ :** శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాల యం లో ఈనెల 14 నుంచి జాతీయ గ్రంథాల య వారోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు గ్రంథాలయం కమిటీ అధ్యక్షులు డోగిపర్తి శంకరరావు తెలిపారు. శనివారం ఉదయం హనుమంతరాయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. గ్రంథాల యంలో వారోత్సవాలను 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటలకు అనేక అంశాలపై సాహితీ సభలు, ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. 20వ తేదీ సోమవారం ఉదయం ముగింపు సభ ఉంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో గ్రంథాలయ అభివృద్ధి పర్యవేక్షకులు బెల్లపు బాబ్జి, కమిటీ కార్యదర్శి నీలం దుర్గారావులు పాల్గొన్నారు.

నేటికీ టిడ్కో ఇళ్లు కేటాయించలేదు

ప్రజాశక్తి - భవానీపురం : తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు నేటికి వైసిపి ప్రభుత్వం కేటాయించకపోవడం దారుణమని తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్ ఘాటుగా విమర్శించారు. మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్ సారథ్యంలో బాబు షూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. 42వ డివిజన్ అధ్యక్షురాలు యేదుపాటి వెంకట రమణి, ప్రధాన కార్యదర్శి సీత చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆలుగండ్ల సుబ్బారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కోడిబోయిన స్రవంతి ఆధ్వర్యంలో 6,7,10, బూత్‌ల ఇన్‌చార్జ్‌లతో శనివారం హెచ్‌బి కాలనీ, ఓల్డ్ ఎంఐజి, అప్నా బజార్ నుండి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

జగన్ చేసిన అభివృద్ధి ఏమీలేదు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఆంధ్ర రాష్ట్రం నుండి జగనాసురిడిని తరిమి కొట్టిన రోజే నిజమైన దీపావళి పండుగ అని తెదెపా రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) అన్నారు. ఇబ్రహీం పట్నంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-23 మధ్య కాలంలో రంగులు మార్చడం, పేర్లు మార్చు, అధిక ధరలు, క్రొత్త పన్నుల భారం, పరిశ్రమలను తరమడం, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే జగన్ రెడ్డి సాగించిన విష్వాత్మక పాలన అని గన్నె ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

'విజ్ఞాన్'లో దీపావళి వేడుకలు

ప్రాజశక్తి - జగ్గయ్యపేట: దీపావళి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో 'దీపాల మహోత్సవం' జరిగింది. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి పండుగ విశిష్టతను వివరిస్తూ లోక కళ్యాణార్థం శ్రీ కృష్ణుడు, సత్యభామలు రణరంగంలో నరకాసురుణ్ణి వధించటం ద్వారా నరక చతుర్ద శి అంటారని, చెడుని మంచి జయించటం వలన రకరకాల రంగులను వెదజల్లే మతాబులు కాలుస్తారని తెలుపుతూ విద్యార్థులతో కొన్ని కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు కాల్పించారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అధిక ఫీజులపై స్పందించాలి

ప్రజాశక్తి మైలవరం : పరీక్షలు, ప్రాక్టికల్స్ పేరుతో జూనియర్ కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించాలని మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం.చరణ్ తేజ్, వి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాల యంలో శనివారం వారు విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ మైలవరం జూనియర్ కళా శాలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన ఫీజులు కంటే రూ.1500 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ బోర్డ్ భూములు అన్యాక్రాంతం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : వైసిపి ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డ్ భూములు అన్యాక్రాంతం అయిపోతున్నాయని జనసేన నగర అధ్యక్షులు, పశ్చిమ ఇన్‌ఛార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ తెలిపారు. పంజాసెంటర్‌లో మాదిగ (మహాద్విగ్గ) సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు పైడిముక్కల.చక్రవర్తి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్, జై భీమ్ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ పరస సురేష్, సింహాచలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దాడి దేవజగన్, ఎంఐఎం పార్టీ నాయకులు సమీర్, వాయిస్ ఆఫ్ మాల మహానాడు అధ్యక్షులు శ్యాం, ప్రముఖ న్యాయవాది పిళ్లా శ్రీనివాసరావు పాల్గొని కేకు కట్ చేసిన అనంతరం అబుల్ కలాం ఆజాద్, అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడారు.

ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయండి

హనుమాన్‌జంక్షన్‌లో కరపత్రాలు పంచుతున్న నాయకులు

చల్లపల్లిలో మాట్లాడుతున్న యద్దనపూడి మధు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: ధరల పెరుగుదలతో సామాన్యుల నడ్డి విరుగుతున్నా, ప్రధాని మోదీ మాత్రం భారత్ అభివద్ధిలో ముందుకు పోతుంది అంటూ అవాస్తవాలు చెబుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి బేతా శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ బేరి బహిరంగ సభకను జయప్రదం చేయాలని కార్మిక ,కర్షకులు ,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్డులో సిపిఎం సిఐటియు కార్మికుల కారపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యాఅవసరాల ధరలను విపరీతంగా పెరిగాయని, ప్రజల ఆదాయాలు మాత్రం పెరగలేదని అన్నారు.రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి, జనసేన అంటకాగుతున్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నల్లి. ఆంజనేయులు పంచాయతీ నాయకులు బంగారు బాబు ముఠా నాయకులు కాజా నాగరాజు చందు ప్రసాదు ఇతర కార్యకర్తల పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఈనెల 15వ తేదీ విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో శనివారం సిఐటియు మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి పాలన అస్తవ్యస్తంగా తయారయింది అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోటి చట్టాలను తీసుకొచ్చిందని అన్నారు. సిఐటియు మండల అధ్యక్షురాలు సిహెచ్. గంగా భవాని అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా అంగన్వాడీ వర్కర్స్, మిడ్ డే మిల్స్ వర్కర్స్, స్కూల్ స్వీపర్స్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలని నిరసన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : పాలస్తీనాలో గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక దాడిని తక్షణమే విరమించుకోవాలని, యుద్ధాలకు కారణం అవుతున్న సామ్రాజ్యవాదం నశించాలని పాలస్తీనలకు భారత ప్రభుత్వం సంఘీభావం ప్రకటించి మద్దతుగా నిలవాలని సిపిఎం కష్ణాజిల్లా కమిటీ సభ్యులు సిహెచ్. రాజేష్ డిమాండ్ చేశారు.పాలస్థినపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని, అమెరికా యుద్ధోన్మాదం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ శనివారం సాయంత్రం మచిలీపట్నం కోనేరు సెంటర్లో సిపిఎం, సిపిఐ మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ యు.ఎన్.ఓ తీర్మానం ప్రకారం పాలస్తీన భూభాగం నుంచి ఇజ్రాయిల్ సైన్యం వైదోలగాలని ఆయన తెలిపారు.సిపిఐ మచిలీపట్నం నియోజకవర్గం కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ పాలస్తీన పై ఇజ్రాయిల్ అమానుష దాడిని అన్ని దేశాల ప్రజలందరూ ఖండించాలని,పాలస్తీలలో శాంతిని నెలకొల్పాలని ఆయన కోరారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదుల విష వలయంలో పాలస్తీన చిక్కుకుందని, శాంతి ద్వారా టెర్రరిజాన్ని రూపుమాపగలవని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మచిలీపట్నం నగర కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు టి. చంద్రపాల్, సిహెచ్. జయరావు, ఎండి యూనస్, ఎస్ ధనుంజయరావు,ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ విజయలక్ష్మి, కే.సుజాత, ఎం పద్మావతి, మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు సిహెచ్. బుల్లెమ్మ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి.నాగయ్య నాయకులు వి. శ్రీదర్, డిపి రంగారావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామ సచివాలయం - 2 నందు శనివారం మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూధనరావు 'ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగన్' 'నేను ఇచ్చిన మాట తప్పను' బుక్ లెట్ లను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేముల. సురేష్ రంగబాబు, కెడిసిసీ బ్యాంక్ డైరెక్టర్ తలుపుల. వెంకటకష్ణ, మండల పార్టీ అధ్యక్షులు పర్ణం, పెదబాబు, మోటేపల్లి. రత్నరావు ,సర్పంచ్ లింగం.విజయకుమార్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలం యుటిఎఫ్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే జీవేంద్రరావు, కార్యదర్శిగా బీ శివరామకష్ణ, గౌరవ అధ్యక్షులుగా విశ్రాంతి ఉపాధ్యాయులు పివి ఆంజనేయులను ఎన్నుకున్నారు. శనివారం సంస్థ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు బి కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిపిఎస్ సిపిఎస్ లు రద్దుచేసి ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో మూడు నాలుగు ఐదు తరగతులను కొనసాగించాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాల లు బోలోపేతం అవుతాయని అన్నారు. ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు నియమించే విధంగా చూడాలని కోరారు. కాగా నూతన కమిటీలో సాహద్యక్షులుగా ఎన్ ఆర్ కె వి ప్రసాద్ ఆర్ విమల కోశాధికారిగా ఎస్ శ్రీనివాసరావు, అడక్క కమిటీ కన్వీనర్‌గా ఏ శాంతకుమారి, కార్యదర్శులుగా ఏ సంధ్యారాణి, డి లక్ష్మీనారాయణ, కే స్వామియే వెంకటేశ్వరరావు, సిహెచ్ వి జై శ్రీ జిల్లా కౌన్సిలర్ గా ఎం పూర్ణచంద్రరావు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి జి గోపాలకష్ణ, ఎన్ వెంకటేశ్వరరావు ఎల్ సుభాషిని పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న బి. కనకారావు

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు కెకెఆర్ గౌతమ్ విద్యార్థి

ప్రజాశక్తి - గుడివాడ : నవంబర్ నెలలో జరిగిన 35వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థి జి శ్రీమంత్ జాతీయస్థాయి రోలర్ హాకీ క్యాడిట్ టీంకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్స్ సత్యారాం, లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ డిసెంబర్ 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు చండీగర్ లో జరిగే 61వ నేషనల్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ లో ఎంపికైన శ్రీమంత్ పాల్గొంటారన్నారు. అనంతరం శ్రీమంత్ ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పలువురు అభినందించారు.

'మువ్వ'ల రవళి...అలేఖ్య

- చిన్న వయసులో కూచిపూడి, భరతనాట్యంలో విశేష ప్రతిభ
- జాతీయస్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి-గన్నవరం : 12 ఏళ్ల ప్రాయం.. 40ప్రదర్శనలు..పలు పురస్కారాలు.. వైవిధ్యమైన తన నత్యాభినయంతో రాణిస్తూ గొప్ప వాళ్ళ చేత మన్ననలు పొందుతోంది బాలిక. బాల్యానికి నడకలు నేర్పితే భవిష్యత్ పరుగులు పెడుతుంది. ఇప్పటికే పలువురు చిన్నారులు వయసుకు మించిన ప్రతిభతో ప్రపంచ రికార్డులను తిరగరాస్తున్నారు. ఈ కోవకు చెందినదే టి.శ్యామ అలేఖ్య. మూడేళ్ల వయసు నుండి కూచిపూడి, భారతనాట్యంలో సత్తా చాటుతోంది. పలు రాష్ట్రీయ, జాతీయ వేదికల్లో తన నత్య ప్రదర్శనలతో అబ్బురపరుస్తూ అవార్డులతో పాటు ప్రశంసలు అందుకుంతోంది. స్థానిక రాయనగర్ కు చెందిన టి. మాతానెహ్రు, సీతామహాలక్ష్మి దంపతుల కుమార్తై శ్యామలలేఖ్య. డా " కె . కె . ఆర్ గౌతమ్ ఇంటర్ నేషనల్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. చిన్నతనంలో టీవీలో కూచిపూడి, భారతనాట్యం వంటి ప్రదర్శనలు చూస్తూ కళ లపై మక్కువ పెంచుకుంది. జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలైన తల్లి సీతామహాలక్ష్మి కుమార్తై ఆసక్తిని గుర్తించి మూడేళ్ల వయసులోనే గురువు మురళీ కష్ణ గారి దగ్గర కూచిపూడి నత్యంలో శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం అలేఖ్య విజయవాడలోని ఘంటసాల కళాక్షేత్రంలో గురువు డా " అజయ్ కుమార్ వద్ద నాలుగు సంవత్సరముల సర్టిఫికేట్ కోర్సును చేస్తుంది.

అలేఖ్య సాధించిన అవార్డులివే

– విజయవాడలో ఖుషి టీవీ ఆధ్వర్యంలో జరిగిన 'రారా...కష్ణయ్య ' నత్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ అవార్డు అందుకుంది.
– విజయవాడలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కూచిపూడి మహాబంద నాట్య పోటీల్లో సిలికాన్ ఆంధ్ర గిన్నీస్ బుక్ అవార్డు సాధించింది.
– విజయవాడలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కల్చరర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో నాట్యవినోదిని, బాల నాట్యమయూరిగా నిలిచింది.
– రాజమండ్రిలో జరిగిన అన్నమాచార్య పద నత్యాంజలి- భారత్ వరల్డ్ రికార్డు పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఆవార్డు అందుకుంది.
– వైజాగ్లో జరిగిన జీనియస్ తెలుగు వరల్డ్ రికార్డ్స్ అండ్ కళాభారతి పోటీల్లో ఉత్తమ ప్రతిభ అవార్డు లభించింది. లితిరుపతిలో జరిగిన ఇండియన్ క్లాసికల్ అండ్ ఫోక్ డ్యాన్స్ ఉత్సవాల్లో బాలనర్తకి అవార్డు కైవసం చేసుకుంది.
– విజయవాడలో జరిగిన మువ్వ గోపాల కల్చరల్ ఆర్ట్స్ ఆకాడ మీ పోటీల్లో కళా మయూరి అవార్డు, షిర్డిలో జరిగిన నత్య ప్రదర్శనలో గురు సద్భావన అవార్డు, పర్యటన్ పర్వ్ ఉత్స వాల్లో బెస్ట్ అవార్డు అలేఖ్య అందుకుంది.

ప్రతిభకు పట్టం :
తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతో అతి చిన్నవయసులోనే పలు వేదికలపై కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఇస్తూ ప్రత్యేకతను చాటుకుంటుంది. ఆరేళ్ల వయసులోనే మహానాట్య బందం, కల్చరర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, అన్నమాచార్య పద నత్యాంజలి వంటి జాతీయ స్థాయి నత్య ప్రదర్శనలు 40కి పైగా ఇచ్చింది. బాలనర్తకి, కళామయూరి, గురుసద్భా వన, నాట్య వినోదిని, బాలనాట్య మయూరి బిరుదులను, ఎన్నో అవార్డు లను అందుకుంది.

మరింత ఎదగాలని ఆకాంక్ష
- సీతామహాలక్ష్మి, అలేఖ్య తల్లి

మూడేళ్ల వయసులోనే నాట్యంపై మా అమ్మాయి ఆసక్తిని గమనించాను. మూడేళ్ల వయస్సు నుండి నిరంతర శిక్షణ ద్వారా కూచిపూడి భారత నాట్యంలో రాణించింది. చిన్నవయసు లోనే ప్రశంసలు అందుకోవడం అనందంగా ఉంది. రానున్న రోజుల్లో అంతర్జాతీయ వేదికల్లో కూడా నత్య ప్రదర్శనలు చేస్తుందని బలంగా ఆశిస్తున్నాను. మరింత ఉన్నత స్థాయికి ఎదిగి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆకాంక్ష.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-ఉంగుటూరు : సెయింట్ జార్జ్ ఆర్‌సిఎం ఇంగ్లీష్ మీడియం స్కూలు విద్యార్థినికి జిల్లా స్థాయి బహుమతి రావడం అభినందనీయమని స్కూల్ ప్రిన్సిపాల్ ప్రతిమ శ్యామల అన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్య సాయి సేవా సమితి వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆచార్యదేవోభవ అనే అంశంపై వ్యాసం రాసిన మండలంలోని పెద్ద అవుటపల్లి ఆర్ సియం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్ మేఘన జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి సాధించి జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తాన చేతుల మీదగా బహుమతి పొందడం అభినంద నీయం అని శ్యామల అన్నారు. స్కూల్ కరస్పాం డెంట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మేఘనకు అభినందనలు తెలిపారు.

మేఘునను అభినందిస్తున్న డిఇఒ తాహేర సుల్తానా

'పల్లెకు పోదాం' ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోను అమలు చేయనివిధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో తొలి విడతగా 257 గ్రామ, వార్డు సచివాలయాలలో ఈనెల 9 నుండి 23వ తేదీ వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని డిసిప్లే బోర్డుల ద్వారా ప్రజలకు వివరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయండి

●ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి సంపర శ్రీనివాసరావు ●వాలంటీర్లకు రెడ్ టీ షర్టులు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈనెల 15న నగరంలోని ఎంబి స్టేడియంలో జరిగే సిపిఎం ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి సంపర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభను పురస్కరించుకొని సంపర తాతబ్బాయి ట్రస్ట్ తరపున పశ్చిమ నియోజకవర్గం మల్లికార్జునపేటలో బహిరంగ సభ వాలంటీర్లకు శనివారం ఆయన టీ షర్టులు పంపిణీ చేశారు. నీతి గల రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం సిపిఎం అని ఆయన పేర్కొన్నారు. కార్మిక, కర్షక, కష్టజీవుల తరపున ఆ పార్టీ అనునిత్యం పోరాడుతోందని పేర్కొన్నారు. ఆనాడు తెలంగాణ సాయుధ పోరాటంలో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిందని గుర్తుచేశారు. ప్రజలకు కష్టకాలంలో సేవలందించడంలోనూ ముందుందని కొనియాడారు. కరోనా సమయంలో మృతదేహాలకు ఖననం నిర్వహించడం, ఆ సమయంలో జీవనోపాధిలేక ఇబ్బందులు పడిన ప్రజలకు అన్నదానం చేయడం వంటి మానవత విలువలతో కూడిన ఎన్నో

టీషర్టులు పంపిణీ చేస్తున్న సంపర

సేవా కార్యక్రమాలు నిర్వహించిందని సంపర గుర్తుచేశారు. టీ షర్టుల పంపిణీ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ నాయకులు సూరిబాబు సాంబులు, ఐలు రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటరావు, న్యాయవాది, ఎస్‌ఎఫ్‌ఐ సయ్యద్ అప్పలస్వామి కళాశాల మాజీ అధ్యక్షుడు కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్తల ఉద్యమాలతో స్ఫూర్తి పొందాలి

ప్రముఖ రచయిత, కవి గుమ్మా సాంబశివరావు

ప్రజాశక్తి - విజయవాడ : సంఘ సంస్కర్తల ఉద్యమాలతో స్ఫూర్తి పొందాలని ప్రముఖ రచయిత, కవి గుమ్మా సాంబశివరావు మహిళలకు పిలుపునిచ్చారు. నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం 'సంఘ సంస్కరణ ఉద్యమాలు - మహిళలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ రచయిత, కవి గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ తరతరాల నుండి మహిళల సతీసహగమనం, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, జోగినీ వ్యవస్థ, ఓటు హక్కు, విద్యా, ఉద్యోగాలు, అణిచివేత, వివక్షకు వ్యతిరేకంగా రాజా రామ్మోహన్‌రాయ్, గురజాడ అప్పారావు, వీరేశలింగం పంతులు, గుర్రం జాషువా, జ్యోతిబాపూలే, హేమలతా లవణం, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ తదితర సంఘసంస్కర్తలు ఉద్యమించారని గుర్తుచేశారు. మహిళల హక్కుల కోసం నడిపిన ఉద్యమాలు, వారు మహిళా కోణంలో రచించిన రచనలను ఉత్తేజకరంగా వివరించారు. ప్రస్తుత మహిళల ఆనాటి సంఘసంస్కర్తల కృషిని ముందుకు తీసుకువెళ్లాల్సిన కర్తవ్యాన్ని వివరిస్తూ 150 సంవత్సరాల క్రితం గురజాడ స్త్రీలను ఉద్దేశించి "అధునిక మహిళ చరిత్ర తిరిగి లిఖిస్తుందని" పేర్కొన్నవిధంగా మహిళలు చైతన్యవంతులు కావాలని, సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. 'స్టెప్ ఎ హెడ్ ఫర్ ఈక్వాలిటీ' అధ్యక్షులు జ్యోత్స మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన హక్కులు మనమే ఉపయోగించుకోవాలని, అన్నింటా సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంబివికె మహిళా విభాగం బాధ్యులు పి.విజయ స్వాగతం పలికారు.

వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

శిక్షణ పొందుతున్న మహిళలకు వైద్య శిబిరం

ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ పొందే మహిళలకు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ లాల్‌పత్ ల్యాబ్స్ ఈదర రాజశేఖర్ ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తపరీక్షల శిబిరంలో 60 మంది పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి



జర్నలిస్ట్ చంద్ర రాసిన సూసైడ్ లెటర్

జర్నలిస్ట్ చంద్ర ఆత్మహత్య

సూసైడ్ లెటర్ లభించింది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బిటెక్ ఫస్టియర్, కుమార్తె ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్.చినబాబు సంఘటనా స్థలానికి చేరుకుని చంద్ర భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్ర భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చంద్రకు పలువురు నేతల నివాళి

జర్నలిస్టు కల్లేపల్లి చంద్ర అంత్యక్రియలు శనివారం ఆయన స్వగ్రామమైన చల్లపల్లిలో నిర్వహించారు. అంతకుముందు చంద్ర భౌతికకాయాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, జడ్‌పిటిసి సభ్యులు రాజంపేట కళ్యాణి దంపతులు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, టిడిపి మండల కార్యదర్శి మోర్ల రాంబాబు తదితరులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

జర్నలిస్టుల నివాళి

జర్నలిస్ట్ యూనియన్ నాయకులు చందమామ బాబు, పాత్రికేయులు ఎన్ నీలా బ్రహ్మేంద్ర, పేరం మధుసూదన్ రెడ్డి, జిలాని, బి మధుసూదన్ రావు, గడ్డిపాటి సుధీర్ బాబు, వెంకట్, ఆకుల హరిప్రసాద్, బెల్లంకొండహరి ప్రసాద్, కావూరి సాల్మన్ రాజు, ఎల్.శ్రీనివాసరావు, కె. బాబురావు గోవర్ధన్ తదితరులు చంద్ర అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

పలు జర్నలిస్టు సంఘాల సంతాపం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్

జర్నలిస్ట్ చంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాస్, విజయవాడ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ డిమాండ్ చేశారు. జర్నలిస్టుల దయనీయ పరిస్థితికి ఈ సంఘటన అద్దంపడుతోందని వారు పేర్కొన్నారు. చంద్ర మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ చంద్ర బలవన్మరణం పట్ల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) రాష్ట్ర అధ్యక్షులు బడే ప్రభాకర్ సంతాపం తెలిపారు. చందు మృతికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చంద్ర కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ ఇవ్వాలని ఎస్‌సి, ఎస్‌టి వర్కింగ్ జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద్ కొండేటి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జీతాలివ్వండి మహోప్రభో!

రాక తాము పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. 'జీతాలు ఇప్పించండి మహాప్రభో' అంటూ డివిజన్, జిల్లా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడుసార్లు స్పందనలో అర్జీలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.

కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంత గ్రామాలకు తాగునీరు అందించడానికి ప్రభుత్వం మల్టీ విలేజ్ రూరల్ వాటర్ సప్లయ్ స్కీంను ఏర్పాటు చేసింది. నాగాయలంక మండలం ఎదురుమొండి, కమ్మనమోలు, కోడూరు మండలం పెదకమ్మవారిపాలెం, దింటిమెరక, అవనిగడ్డ మండలం రామచంద్రాపురం గ్రామాల్లో ఉన్న ఈస్కీం ద్వారా మూడు మండలాల్లోని తీర ప్రాంత గ్రామాలన్నింటికి నీరు సరఫరా అవుతోంది. నిర్దేశించిన సమయంలో స్కీంల నుంచి నీటిని విడుదల చేయడానికి, మరమ్మతులు చేయడానికి స్కీం వర్కర్లను నియమించారు. ఎదురుమొండిలో నలుగురిని, కమ్మనమోలులో ఎనిమిది మందిని, పెదకమ్మవారిపాలెంలో ముగ్గురిని, దింటిమెరకలో ముగ్గురిని, రామచంద్రాపురంలో నలుగురిని... మొత్తం 22 మంది కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారు. నెలకు మెయిన్ వర్కర్‌కు రూ.11,500, సహాయకునికి రూ.10,500 చొప్పున కాంట్రాక్టర్ వేతనం చెల్లించాలి. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదనే కారణంతో కాంట్రాక్టర్ 2021 ఏప్రిల్ నుంచి సకాలంలో బిల్లులు ఇవ్వడం నిలిపివేశారు. ఉప్పు పప్పు కొనుక్కోవడానికి మధ్య మధ్యలో కాంట్రాక్టర్ కొంత మొత్తం ఇచ్చి సరిపెట్టారు. ఇంకా కార్మికులకు రూ.33 లక్షలకు పైగా జీతాలు చెల్లించాల్సి ఉంది.

స్పందన లేదు...!

జీతాలు చెల్లించాలని నియోజకవర్గ కేంద్రం అవనిగడ్డ కార్యాలయంలో పలుమార్లు అధికారులను వేడుకున్నారు. కార్మికులకు కొద్ది మొత్తంలో అయినా జీతాలు ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు దసరా పండుగకు ముందు ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి సూచించారు. కానీ కాంట్రాక్టర్ మాత్రం ప్రభుత్వం బిల్లు మంజూరు చేయకుండా ఇవ్వలేమని చేతులెత్తేశారు. దీంతో పండుగలకు తమ కుటుంబాలు ఉసూరు మనాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే స్పందనలో 2022 అక్టోబర్ 10వ తేదీన ఈ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారికి కలెక్టర్ సూచించారు. అయినా పరిష్కారం కాలేదు. ఈ ఏడాది జూలైలో రెండో సారి, అక్టోబర్ 18న మూడో సారి స్పందనలో వినతులు సమర్పించారు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

అస్తవ్యస్తంగా డ్రైనేజి వ్యవస్థ

మారిపోయింది. మరో వైపు ఎక్కడా లేని విధంగా పైకప్పులు లేని ఓపెన్ డ్రెయిన్‌లు వందల సంఖ్యలో ఇక్కడ ఉన్నాయి. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 1237 ఓపెన్ డ్రెయిన్‌లు ఉన్నాయి. వీటిల్లో 97 డ్రెయిన్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిపై పైకప్పు, పక్క గోడలు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయాలకు మారాయి. దీంతో ఇప్పటికే ఇద్దరు బాలురు వీటిల్లో పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. అధికారుల నిర్లక్షం వల్ల మూడు రోజుల క్రితం పాత రాజరాజేశ్వరిపేటలో ఐదేళ్ల బాలుడు ప్రాణాలు పోగొట్టుకోగా ఆరు మాసాల క్రితం గురునానక్ కాలనీలో ఆరేళ్ల బాలుడు డ్రెయిన్‌లో పడి మృత్యువాత పడ్డాడు. అయితే గురునానక్ కాలనీ సంఘటనతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఓపెన్ డ్రెయిన్‌లపై మూతలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విఎంసి అధికారులు వెల్లడించారు. ఎన్ని డ్రెయిన్‌లకు పైమూతలు వేయాలనే దానిపై సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. తర్వాత దానిని గాలికి వదిలేశారు. దీంతో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది.

ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయండి పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు, ఆటో శాఖ కార్యదర్శి ఎం.హనుమంతరావు, ఆటో వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె.దుర్గావళి, నగర నాయకులు డి.కోటయ్య, బి.రూబెన్ కుమార్, ఎస్.డి.కరీముల్లా, ఆర్.సుబ్బరాజు, ఎ.వి.రెడ్డి, ఎం.ప్రభుదాసు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

I.A. Notice U/o 6 Rule 17 CPC

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.208/2023

O.S.No.258/2017

తోకల రాజ్యలక్ష్మి - పిటిషనర్ / వాది

Vs

కంద్రా లక్ష్మీ కాంతమ్మ

మరియు వగైరాలు - రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

To,

(R1) **కంద్రా లక్ష్మీ కాంతమ్మ, భర్త లేట్ నరసయ్య,** డోరు నెం.61-9/4-15, ఫ్లాట్ నెం.401, A B ప్లాజా, ఉమ్మడిశెట్టి కోటేశ్వర రావు వీధి, కరెంట్ ఆఫీసు ఎదురు, కృష్ణ లంక, విజయవాడ-13, కృష్ణా జిల్లా.

పై కనపరచిన పిటీషనరు / వాది నీ మీద పిటిషను ఆర్డర్ 6 రూల్ 17 సి.పి.సి.క్రింద దాఖలు చేసియున్నారు. మీరు స్వయంగా కానీ, మీ నుంచి సంపూర్ణ సంజాయిషీ పొందిన లాయరు ద్వారా కానీ సదరు పిటిషను ప్రత్యుత్తరములు చెప్పగలందుకు **తే04-12-2023 దికి** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ సంజాయిషీ తెలుపుకో వలసినదిగా మిమ్మల్ని ఆదేశించడమైనది. లేనియెడల మీ పరోక్షమందు పై పిటిషన్ తీర్మానించెదరు.

వాయిదా తేది: 04-12-2023

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

శ్రీ **టి.గోపాలకృష్ణ మూర్తి**

వాది తరపు లాయరు.

In the court of the IV Addl junior civil judge at Vijayawada. I.A No: 792/2023

In O.S No: 706/2015

Between:-

Gundapu Ramanamma .... petitioner/plaintiff

And

Lala Ahamed and others ..... Respondents/ defendents

To,

3rd Respondent/3rd defendent Guda Joseph vara Kumar, S/o Jeeva Raju, Hindu aged 39 yearsR/o. DNo.4-374/2, Kavetivari street, Satguru Colony, Ramavarappadu Ring, Vijayawada.

4th Respondent/4th defendent Guda Anil Kumar, S/o Jeeva Raju, Hindu aged 34 years R/o. DNo.4-374/2, Kavetivari street, Satguru Colony, Ramavarappadu Ring, Vijayawada.

పై నెంబరుదావా నందలి ఐ.ఎ పిటీషన్ లో 3వ రెస్పాడెంట్ / డిఫెండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ / డిఫెండెంట్‌లకు కు నోటీసులు జారీ చేయు నిమిత్తం శ్రీ కోర్టు వారు ప్రత్యమ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసియున్నారు. కావున3వ రెస్పాడెంట్ / డిఫెండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ / డిఫెండెంట్‌లకు పై నెంబరు ఐ.ఎ పిటీషన్ నందు ది 28-11-2023న ఉదయం గం॥10-30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వారి న్యాయవాది గారి ద్వారా గాని, హాజరై అభ్యంతరము ఏమైన ఉన్నయడల తెలియజేయ గలరులేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //

వాయిదా తేది: 28/11/2023

ఇట్లు

గుండవు రాజేష్ కుమార్,

అడ్వకేట్,

కృష్ణలంక , విజయవాడ-13,

ఫోన్: 9246470144

ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, అజిత్ సింగ్‌నగర్, లూనా సెంటర్, రైతుబజార్ దగ్గర, డోరు నెం.42-6-8 రు కాపురస్తులు తమ్మిన సన్నీ బాబు గారి కుమారుడు తమ్మిన సూర్య ప్రకాష్ గారు సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది, ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, అడవినెక్క గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తిని ది.10-07-2023వ తేదీన యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, దుర్గాపురం, 4వ లైన్, డోరు నెం.24-25-1రు కాపురస్తులు 1) దొడ్డపనేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు దొడ్డపనేని నవీన్‌కుమార్, మరియు 2) కొటపాటి గోవిందరెడ్డి గారి కుమారుడు కోటపాటి శ్రీనివాసరెడ్డి, 3) మట్లా అంకయ్య గారి కుమారుడు మట్లా రవీంద్ర, 4) మట్లా కొండలరావుగారి కుమారుడు మట్లా యశ్వంత్‌కుమార్, 5)జాజుల చిన కొండయ్య గారి కుమారుడు జాజుల మల్లిఖార్జునరావు గారలు, రేమాల సాయిప్రసాద్ వగైరాల వలన గన్నవరం సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం.7264/2023 రుగా క్రయం పొంది సదరు భూమిని ప్లాట్లుగా విభజించిన ఆస్తిలోని భాగమైనట్టి ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ నివేశన స్థలమును వలన విక్రయ ఖారు పొంది, మరికొద్ది రోజులలో విక్రయ దస్తావేజును వ్రాయించుకుని రిజిష్టరు చేయించు కోబోవుచున్నారు. కావున సదరు భూమిపై ఎవరికైనా యెట్టి అభ్యంతరములు గాని, హక్కులు గాని వగైరా అన్యాక్రాంతములు జరిపిన యెడల నాకు గాని, నా క్లయింటునకు గాని ఈ ప్రకటన విడుదల అయిన తేదీ నుండి 7 రోజుల లోపు తెలియపరచవలసినదిగా కోరుచున్నాము. సదరు గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని నా క్లయింటును బద్ధులను చేయ జాలవు.

షెడ్యూలు:-

ఏలూరు జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఆగిరిపల్లి మండలం, అడవి నెక్కలం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, అడవి నెక్కలం గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తి స్థిరాస్తిలో ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ స్థలముకు హద్దులు:

తూర్పు:అ.33.0లు వెడల్పు గల రోడ్డు అ.31.00లు

దక్షిణము:ప్లాటు నెం.24 అ.42.02లు

పడమర:దద్దనాల రంగారావు గారి భూమి అ.31.00లు

ఉత్తరము:ప్లాటు నెం.22 అ.41.10లు

యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.144.1 లేక చ.మీ.120.4 ర్ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్నూ

Torlikonda Ramakrishna, M.A.,L.L.B.

Advocate, D.No.7-135,

Venu Gopala Swamy Temple Street,

Nunna-521212,

Vijayawada Rural Mandal,

Krishna District, Cell:9849184404.

టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి : సిఐ

గన్నవరంలో దుకాణాదారులకు సూచనలిస్తున్న సిఐ కనకారావు

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా ఐ పి ఎస్ ఆదేశాలనుసారం గన్నవరం డిఎస్పి జయ సూర్య అధ్యక్షతన శనివారం గన్నవరం సిఐ పి. కనకారావు తన సిబ్బందితో గన్నవరంలోని టపాసుల గోదాములను తనిఖీ చేశారు. గన్నవరం కొనాయి చెరువు వద్ద గల, బి బి గూడెంలో గల బాణసంచా గోడౌన్ లను చూశారు. నిర్వాహకులతో మాట్లాడి అగ్నిమాపక ఏర్పాట్ల గురించి ప్రశ్నించారు. నిబంధనలు పాటించకపోతే గోదాముల సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం పురుషోత్తపట్నం రోడ్డు లోని హరివిల్లు వెంచర్ లో గల దీపావళి బాణసంచా రిటైల్ షాపులను పరిశీలించారు. ఆయా ప్రదేశంలో గల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు షాపు యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గూడూరు :** దీపావళి పండుగ పురస్కరించుకుని పెడన నియోజవర్గ పరిధిలో అనుమతులు లేకుండా ఎవరైనా వ్యాపారస్తులు టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పెడన సీఐ ఎండి హబీబ్ భాషా పేర్కొన్నారు. పెడన పట్టణ శివారు గుడివాడ రోడ్ లో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఏర్పాటుచేసిన టపాసుల విక్రయ దుకాణాలను సీఐ హబీబ్ భాషా పెడన ఎస్సై రవికుమార్ తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టపాసుల విక్రయ దుకాణదారులకు సిఐ పలు సూచనలు చేశారు. పెడన నియోజకవర్గం పరిధిలో రెవిన్యూ శాఖ సూచించిన ప్రాంతాలలోనే టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. టపాసులు విక్రయ దుకాణాల మధ్య దూరం పది అడుగులు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇసుక బక్కెట్లు, నీళ్ల డ్రమ్ములను దుకాణాలకు అత్యంత సమీపంలో సిద్దపరచుకోవాలని సూచించారు. **ప్రజాశక్తి - మొవ్వ :** మువ్వ మండలంలోని దీపావళి బాణాసంచా దుకాణాలను శనివారం సాయంత్రం కూచిపూడి ఎస్సై డి సందీప్ తో కలిసి పామర్రు సీఐ వి.సుభాకర్ పరిశీలించి అమ్మకం దారులకు పలు సూచనలు ఇచ్చారు. దీనిలో భాగంగానే పెదపూడి వర్తక సంఘ కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన లైసెన్స్ దారులతో మాట్లాడి తగు హెచ్చరికలు జారీ చేశారు. దుకాణాల పరిసరాలలో బాణాసంచా కాల్చరాదనిహెచ్చరించారు. ప్రమాదవశాత్తు ఏదైనా అగ్రి ప్రమాదం జరిగితే మంటలను అదుపు చేయడానికి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ తనిఖీలు నిర్వహించారు.

సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు చెన్నుబోయిన శివయ్య

టిడిపితోనే యువతకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రలో యువత భవిష్యత్తు అంధకారంగా మారిందని, తెలుగుదేశం పార్టీ పాలనలోనే యువతకు బంగారు భవిష్యత్తు ఉందని సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత చిన్నబోయిన శివయ్య అన్నారు. కే.సీతారామపురం గ్రామంలో గన్నవరం తెలుగు యువత అధ్యక్షులు పరుచూరి నరేష్ ఆధ్వర్యంలో గ్రామ తెలుగు యువత నూతన కమిటీని ఎన్నుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా సీనియర్ తెలుగుదేశం పార్టీ నేత చనిపోయిన శివయ్య పాల్గొన్నారు. అనంతరం సీతారామపురం గ్రామ తెలుగు యువత కమిటీ నూతన అధ్యక్షులుగా చనిపోయిన కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సోదిమెళ్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా గాలింకి కిరణ్ కుమార్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిన్నబోయిన శివయ్య మాట్లాడుతూ వైసిపి పాలనలో ఈ నాలుగు సంవత్సరాల్లో ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని, నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన రూ. 3000 నిరుద్యోగ భతిని జగన్ రెడ్డి రాగానే రద్దు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో .రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కొసరాజు నాగ సాయిరాం, గన్నవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పరుచూరి నరేష్, గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత కోఆర్డినేటర్ కంభంపాటి బాల నరేష్, తెలుగు యువత ఉపాధ్యక్షులు తాటిపాముల నాగయ్య, తెలుగు యువత సభ్యులు గూడపాటి రంజిత్ కె.సీతారామపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెన్నుబోయిన నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రొద్దుటూరు గంగరాజు,వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్‌టిసి కార్గో డోర్ డెలివరీ సేవలపై అవగాహన

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్ డిపోలో డోర్ డెలివరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులకు అవగాహన కలిగించేలా ఇబ్రహీంపట్నం బస్ డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం అసిస్టెంట్ మేనేజర్ శ్రీదేవి శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. వినియోగదారులకు డోర్ డెలివరీ సేవలు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ర్యాలీగా తన సిబ్బందితో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వినియోగదారులు పార్సిల్ బుక్ చేసేటప్పుడే బుకింగ్ ఛార్జీలతో పాటు డోర్ డెలివరీ ఛార్జీలు కూడా చెల్లించి పార్సిల్ పొందిన వారి చిరునామా ఫోన్ నెంబరు పిన్ కోడ్ తప్పనిసరిగా తెలియజేయాలని కోరారు. పార్సిల్ అండ్ కొరియర్ డోర్ డెలివరీ చార్జీలు 1 కేజీ వరకు 18 రూపాయలు ఒక కేజీ నుండి 6 కేజీల వరకు రూ.30లు 10 కేజీల వరకు రూ.36 10 కేజీ నుంచి 25 కేజీల వరకు రూ.48, 25 కేజీల నుంచి 50 కేజీల వరకు 59 రూపాయలు కావున వినియోగదారులు అందరూ ఈ డోర్ డెలివరీ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం అసిస్టెంట్ మేనేజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

బిసిలకు భరోసా కల్పించడమే లక్ష్యం : టిడిపి

మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : బీసీల అబివృద్ధి, అభ్యున్నతి లక్ష్యంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశాలకు సంబంధించి మచిలీపట్నం పార్లమెంటు. టీడీపీ కార్యాలయంలో పార్లమెంటు అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ ఆధ్వర్యంలో, బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం లక్ష్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం కొనకళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో బీసీలు ఓటర్లుగా మిగిలిపోతున్నారని, దాడులు దౌర్జన్యాలతో బీసీలను బతకడమే కష్టం అనేలా చేశారని అవేదన వ్యక్తం చేశారు. బీసీల నిధులు లాక్కుని, ఉద్యోగాలు లాక్కుని, పదవులు దూరం చేసి దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలనలో బీసీలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వ కార్యదర్శి బొడ్డు వేణుగోపాలరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహ కార్యదర్శులు కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య),రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బండి రామకృష్ణ

మాట్లాడుతున్న బండి రామకృష్ణ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం జనసేన పార్టీ విస్తత స్థాయి సమావేశం శనివారం ఇన్చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యం లో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాబోయే 2024 ఎన్నికలకు జనసేన టిడిపి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ జన సైనికులు క్రమశిక్షణగా పనిచేయాలని తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గం జనసేన టిడిపి ఉమ్మడి కార్యక్రమాలు ఉంటాయని ప్రజల తరపున సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. నియోజవర్గ స్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కషి చేద్దామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, గళ్ళ తిమోతి, కొట్టే వెంకట్రావు, బొమ్మ సాని నరేష్, మోకారవి,జన్ను నాగరాజు,కర్ర రామకష్ణ, సమీర్, నాంచారయ్య, వేణు, సత్యనారాయణ, విష్ణు, పామర్తి రాజేష్,చంటి తదితరులు పాల్గొన్నారు.

మద్యంతో వేల కోట్లు దోపిడీ : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం విక్రయిస్తున్న నాసిరకం మద్యం వల్ల వచ్చే వేల కోట్లు ఎవరి జేబులోకి వెళుతున్నాయని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావు శనివారం ఓ ప్రకటన లో ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యంలో హానికారక పదార్థాలు ఉంటున్నాయని యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమద్యం తాగిన అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. మద్యం విక్రయాల ద్వారా వస్తున్న కోట్లాది రూపాయలు సొమ్ము తాడేపల్లి ప్యాలెస్‌కి తరలిపోతుందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలపై 57 వేల కోట్ల విద్యుత్ భారం ప్రజలపై వేసినా రాష్ట్రంలో కరెంటు కోతలు తప్పడం లేదన్నారు. రూ.2.2లక్షల కోట్ల విద్యుత్ కాంట్రాక్టులు సీఎం తన బినామీలకు ఇచ్చారని ఆరోపించారు. ఇసుక దోపిడి ద్వారా వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని, ఉచిత ఇసుకను రద్దు చేయటం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల ఉపాధి కోల్పోయారని అన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సింగినగర్ వాంబే కాలనీకి చెందిన వికలాంగుడు దూరి నాగరాజు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతూ, సహాయం కోసం దీవెన ఫౌండేషన్‌ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జీవన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసు వారు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం రెండు బస్తాలను గ్రూప్ సభ్యులు సత్యనారాయణపురం క్రైమ్ హెడ్ కాని స్టేబుల్ ప్రవీణ్, ట్రాఫిక్ కానిస్టేబుల్ కిషోర్ వారి ఇంటికి వెళ్లి శని వారం అందజేశారు. కుటుంబీకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యభగవంతరావు వర్ధంతి

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని ఈపూరివానిగూడెంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు, అంతర్జాతీయ డప్పు కళాకారులు కుంపటి సూర్యభగవంతరావు 2వ వర్ధంతి కార్యక్రమం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్న డప్పు కళకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన సూర్యభగవంతరావు గొప్ప వ్యక్తి అన్నారు. సూర్యభగవంతరావు కొందరి వాడు కాదని ఆయన అందరి వాడు అన్నారు. తెలుగుజాతి చరిత్రలో దివిసీమకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉందని, తెలుగు సాహిత్య రంగానికి ఎనలేని ప్రాధాన్యతనిచ్చిన ప్రాంతం దివిసీమ అన్నారు. త్యాగరాజ వారసత్వాన్ని కొనసాగించింది దివిసీమేనన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సూర్యభగవంతరావు పలువురికి ఆదర్శనీయులన్నారు. రాజకీయాలకతీతంగా కళలను, కళాకారులను గుర్తిస్తున్న బుద్ధప్రసాద్ అభినవ శ్రీకష్ణ దేవరాయులు ఆయన కొనియాడారు. సూర్యభగవంతరావు విగ్రహ నిర్మాణాన్ని తన భుజస్కందాల మీద వేసుకుని 2వ వర్ధంతి కార్యక్రమాన్ని సైతం ఘనంగా నిర్వహించిన టీడీపీ రాష్ట్ర సాంస్కతిక విభాగం జనరల్ సెక్రటరీ దిరిశం బాలకోటయ్యను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ పదవి పొందిన కొడాలి భక్తపాల్ ను మండలి, ఇతర ప్రముఖులు దుస్సాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ వరప్రసాద్, మోర్ల ప్రసాద్, మోర్ల రాంబాబు, సజ్జా చలపతిరావు, పలువురు కళాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

రాష్ట్రస్థాయి పోటీలకు మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ విద్యార్థులు

ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె వెంకయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17, అండర్ 14 ఉమ్మడి కష్ణా జిల్లా బాల బాలికల పెన్సింగ్ పోటీలు విజయవాడలో జరిగాయని ఈ పోటీల్లో తమ పాఠశాల చెందిన అండర్ 17 విభాగంలో పి.సిద్దు (ఇప్పి), ఎస్‌కె.మహమ్మద్ ఆరిఫ్ (పో ఇల్) కె.ఇబ్రహీం ఖలీల్ (శా బార్) ఎన్.దీప్తి (శా బార్) కే అరుణ (ఇప్పి) అండర్ 14 విభాగంలో జై రత్న, వీఐపీ ద్రావిడ్, బి ఉమాదేవి, సిహెచ్ వెంకటలక్ష్మిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 15వ తేదీన నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు అన్నారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుని కే కనకదుర్గ, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

అమ్రిత సాయిలో క్యాంపస్ ఎంపికలు

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు చెన్నైకు చెందిన కొల్ బెరా డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. కంపెనీ హెచ్.ఆర్ ప్రతినిధులు శనివారం కళాశాల బిటెక్, ఎంబిఎ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో 14 మందిని కంపెనీ తరుపున డేటా అనలిస్టులుగా ఎంపిక చేసి 3 లక్షల వార్షిక వేతనం నిర్ణయించి వారికి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.శశిధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ కరెస్పాండంట్ కె.రామ్మోహన రావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, ప్లేస్మెంట్ కోర్డినేటర్ బి.రామారావు అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కష్ణాజిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బాక్సింగ్ ఇన్ షాడో స్పోర్ట్స్ ఫిట్నెస్ క్లబ్‌లో జిల్లా పురుషుల, మహిళల బాక్సింగ్ జట్లను శనివారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ్మడి వీరరాఘవులు తెలిపారు. ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి 15 వరకు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ ఎంపికలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ చీఫ్, బాక్సింగ్ ఇన్ షాడో స్పోర్ట్స్ ఫిట్నెస్ క్లబ్ ప్రెసిడెంట్ కోచ్ ఎన్ హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనట్లు తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ కార్యదర్శి కె.వి.చైతన్యకుమార్, కోశాధికారి బి.బాలాజీ, కార్యనిర్వాహక కార్యదర్శి బి.రాజా రమేష్ అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిం చాలని కోరారు. ఎంపికైన జట్టుకు కోచ్‌గా బి. రాజారమేశ్, మేనేజర్‌గా దశరథ్ వ్యవహరిస్తారన్నారు. **పురుషుల జట్టు :** శ్రవణ్ కుమార్, జి.రామయ్య, సాయి కిరీటి, వి.ధనుష్, హోసన్నా క్రౌన్, హర్ష, పథ్వి రాజ్, సురేంద్ర. **మహిళల జట్టు :** దీపిక, ఎం.సంఘవి

విషాద ఘటన

కాలం చెల్లిన బస్సులు... సిబ్బంది కొరత... నిర్వహణా లోపం,. అధిక పని భారం వంటి కారణాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం, ఎపిఎస్ఆర్‌టిసి యాజమాన్యం ప్రయాణికులకు ఆర్టీసీని దూరం చేసే చర్యలకు పూనుకోవడమే గాక, వారి జీవితాలతో చెలగాటమాడుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే పరిస్థితులు కూడా ఎదురవుతున్న సంఘటనలు ఇటీవల తరుచూ వినాల్సి వస్తోంది. గత సోమవారం స్థానిక పిఎన్ బస్‌స్టేషన్‌లో అదుపు తప్పిన మెట్రో లగ్జరీ ఎసి బస్సు ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లి, రెప్పపాటులో బీభత్సం సృష్టించింది. బస్సు చక్రాల కింద నలిగి ఔట్ సోర్సింగ్ కండక్టర్‌తో పాటు ఒక మహిళ, ఒక పాప ప్రాణాలు కోల్పోయిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తీరును క్షుణ్ణంగా, పారదర్శకంగా పరిశీలిస్తే ఎక్కడ లోపం జరిగిందో తెలిసిపోతోంది. కానీ చివరకు ఆర్టీసీ డ్రైవర్‌ను బలిపశువును చేసి అతన్ని సస్పెండ్ చేయడం పట్ల ఆర్టీసీ తోటి ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. సరైన శిక్షణ కూడా ఇవ్వకుండా, అంతగా అవగాహన లేని అత్యాధునిక బస్సును మరో మూడు, నాలుగు మాసాల్లో రిటైర్డ్అయ్యే డ్రైవర్ చేతికివ్వడం పట్ల కూడా ఆర్టీసీ సిబ్బందే కాకుండా, అవగాహన కల్గిన ఒకరిద్దరు అధికారులు సైతం ఆర్టీసీ యాజమాన్యాన్ని తప్పుపడుతున్నారు. ప్రమాదానికి గురైన బస్సులో కొంత కాలంగా ఎక్స్‌లేటర్ సెన్సార్ స్తంభిస్తోంది. ఎక్స్‌లేటర్ పెడల్ తొక్కినప్పుడు, కాలు లేపినప్పుడు దాని కింద రోలర్ ముందుకు, వెనుక్కి కదులుతుందనే చర్చ డ్రైవర్లలో లేకపోలేదు. ఇది సెన్సర్‌కు అనుసంధానం అయిఉంటుంది. కొంత కాలంగా సెన్సర్ స్ట్రక్ అవుతుందని, పెడల్ తొక్కి, దానిపై కాలు తీసినప్పుడు వెంటనే పైకి రాకుండా అలాగే ఉండిపోతోందని డ్రైవర్లు గుర్తించడం గమనార్హం. దీని వల్ల కొన్ని సార్లు బస్సు ఒక్క సారిగా ముందుకు దూసుకుపోతోందని, అలా జరిగిందే పిఎన్ బస్‌స్టేషన్ సంఘటన అని డ్రైవర్లు గుర్తు చేస్తున్నారు. జరిగిన ఘోర ఘటనకు గల అసలు కారణాలు ప్రభుత్వంపై, ఆర్టీసీ యాజమాన్యంపై వస్తే ఎక్కడ ప్రయాణికుల్లో పరువు పోతోందని జాగ్రత్తలు తీసుకున్నారనే విషయం బహిరంగ రహ స్యం.

ప్రమాదానికి గురైన మెట్రోలగ్జరీ ఎ.సి బస్సును విజయవాడ మెయిన్ డిపోకు తరలించిన తరువాత, అక్కడున్న డ్రైవర్లు పరిశీలించిన సందర్భంలో దానిలోని లోపాన్ని గుర్తించినట్లు తెలిసింది. సాంకేతిక లోపం కారణంగా బస్సు ఎక్స్‌లేటర్‌ను తేలికగా టచ్ చేసినా స్పీడ్‌గా వెళ్తుందని, ఆ సమయంలో డ్రైవర్ ఆందోళనకు గురికావడంతో పాటు దానిని నియంత్రించడం కూడా చాలా కష్టమని అనుభవం కల్గిన పలువురు డ్రైవర్లు చెబుతున్నారు. దశాబ్దాల తరబడి పని చేస్తున్నా కింద క్యాడర్‌లోని వారికి ప్రమోషన్లు ఇవ్వకపోవడం, చిన్ని చిన్న సంఘటనలకే కఠినమైన శిక్షలు విధించడం వంటి చర్యలతో ఆర్టీసీ డ్రైవర్లు, కండెక్టర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్ లీకేజిలుంటే ఎక్కడికక్కడ బ్రేక్‌లు ఆగే ప్రమాదం ఉంటుంది. ఆయా డిపోల్లో ఉన్న అత్యధిక సర్వీసులకు ఎయిర్‌లీకేజీలు ఉంటాయని డ్రైవర్లు వివరిస్తున్నారు. గ్రీజ్, బ్రేక్ షూల్స్, కాంతి వంతమైన గ్లాస్, ఫ్రెంట్ గ్లాస్ ఇటువంటి చిన్న చిన్న పరికరాల సరఫరా ఉండటం లేదు. కొన్ని బస్సులకు ఫ్రెంట్ గ్లాస్‌కు గమ్‌తో జాయింట్‌లు వేసి ఉంటున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో ఫ్రెంట్ గ్లాస్‌కు క్రాక్ వస్తే వెంటనే దానిని తొలగించి, కొత్త గ్లాస్ ఫిట్ చేస్తారు. కానీ ఇక్కడ దానినే గమ్‌తో అతికించి అలాగే నడుపుతుంటారు. కొన్ని బస్సులకు బ్రేక్/క్లచ్‌లు కూడా లేకుండానే సర్వీసులను నడపాల్సి వస్తోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ మెయిన్ డిపోలో ఉన్న 60 సర్వీసుల్లో దాదాపుగా 40 సర్వీసులకు బ్రేక్/ క్లచ్/ ఫ్రెంట్ గ్లాస్ ఇలా చిన్న చిన్న పరికాలు కూడా వేయకుండానే నడుపుతున్న పరిస్థితి ఉందని సిబ్బంది వాపోతున్నారు. కనీసం బ్యాటరీ కూడా కండీషన్‌గా లేని బస్సులు అనేకం ఉన్నాయని ఆయా డిపోల్లోని డ్రైవర్లు వివరిస్తున్నారు. గేర్ బాక్స్‌లు, డ్రమ్ములు సరిగా లేకపోయినా రోడ్డుపై నడుపుతున్నారు. ఒకవేళ డ్రమ్ములు బాగాలేకపోతే వాటిని బాగు చేయించడానికి ఫౌండ్రి వద్దకు పంపించాలి. కానీ ఆర్టీసీ గ్యారేజీలోనే పేపర్‌తో రఫ్ చేసి, పేపరు కొట్టి వాటినే వినియోగిస్తున్నారనే సమాచారం ఉంది. డ్రైవింగ్‌తో పాటు మిషన్ ఇచ్చి టికెట్స్ కూడా డ్రైవర్ ఇవ్వాల్సి వస్తుండటంతో అదనపు పని భారంతో కేంద్రీకరణ చేయలేకపోతున్నామని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్త బస్సులు కొనుగోలు చేయనందున పండుగలు, ముఖ్యమైన సీజన్లలో వచ్చేరాబడిని కూడా చేజేతులా జార విడుచుకుంటున్నారనే విమర్శ యాజమాన్యంపై లేకపోలేదు. కర్ణుడి చావుకు నూరు కారణాలన్నట్లు... ఆర్టీసి నష్టాలకు, దాని పతనానికి కూడా అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలే కారణమని ప్రయాణికులతో పాటు ఆర్టీసి ఉద్యోగులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- రాజు

'హరివిల్లు'తో సొంతిల్లు

సంస్థ సేల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాస్తి ప్రసన్న

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రోజు రోజుకూ పెరుగుతున్న అద్దెల కారణంగా, గృహావసరాలు కూడా లగ్జరీ అవుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ సొంత ఇల్లు కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశంతో రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న 'హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్' ఆధ్వర్యంలో నూతన వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే విజయవాడ అర్బన్ లిమిట్స్ పరిధిలోని అంబాపురం వద్ద 'ఫ్యూచర్ గోల్డెన్ హోమ్స్' పేరుతో సరికొత్తగా వెంచన్‌ను ఇటీవలే రూపొందించారు. ఇక్కడ ఓపెన్ ప్లాట్స్‌తో పాటు, హౌసింగ్, విల్లాస్ ఏర్పాటుచేసినట్లు సంస్థ సేల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాస్తి ప్రసన్న తెలిపారు. ప్రతి ఒక్కరూ వారు కోరుకున్న విధంగా మంచి ఇంటీరియర్స్‌తో చక్కగా రూపొందించి ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని సదుపాయాలు ఉండేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెపారు. క్వాలిటీ కన్‌స్ట్రక్షన్‌తో పాటుచక్కటి గార్డెన్, ప్లే ఏరియా, పూర్తి రక్షణ, అన్ని విధాలుగా వాస్తు విధానాలను అనుసరించి నిర్మాణాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఫ్లాట్ల ధరలు కూడా అందరికీ అందుబాటులో ఉండేలా అందిస్తున్నామని తెలిపారు.

ఫార్చ్యూన్ గ్రాండియర్....

కేవలం మూడు సంవత్సరాల కాలంలోనే 9 ప్రతిష్టాత్మకమైన ఎపిసిఆర్‌డిఎ అప్రూవ్డ్ ప్రాజెక్టును పూర్తిచేసి విజయవాడలోనే నెంబవర్‌వన్ అగ్రగామి సంస్థగా హరివిల్లు ఉందన్నారు. తమ సంస్థ నుండి గన్నవరం వద్ద గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు 'ఫార్ట్యూన్ గ్రాండియర్'ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇక్కడ ఓపెన్ ప్లాట్స్, హౌసింగ్, అపార్టుమెంట్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్రూవల్ లేఅవుట్, 40 అడుగుల రోడ్లు, ఎలక్ట్రిసిటీతో పాటు ఫుట్‌పాత్‌లు, కాంపౌండ్ వాల్, నేమ్ అండ్ నెంబర్ డిస్‌ప్లే బోర్డులు, చిల్డ్రన్స్ పార్కు, సిట్టింగ్ బెంచీలు, ఎల్ఇడి స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పూర్తి వాస్తుతో పాటు వాటర్ సప్లయ్ పూర్తిగా ఉంటుందన్నారు. సెక్యూరిటీ ఆర్చ్‌తో పాటు డ్రైనేజీ వ్యవస్థ కూడా చక్కగా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయి డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాకింగ్ ట్రాక్, క్రికెట్ నెట్, షటిల్ కోర్టును కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 97045 25556 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

సిగ్నేచర్ సిటీ....

హరివిల్లు సంస్థ నుండి మరో ప్రతిష్టాత్మకమైన వెంచర్ కంకిపాడు వద్ద ఫార్ట్యూన్ సిగ్నేచర్ సిటీ పేరుతో సరికొత్తగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ గల వెంచర్‌గా రూపొందించామన్నారు. ఓపెప్ ఫ్లాట్స్, హౌసింగ్‌లో డబుల్ త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. అన్ని సదుపాయాలు ఉండేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. వివరాలకు పటమట పంటకాలువ వద్ద గల తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

చెర్రీస్‌లో నోరూరించే స్వీట్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పండుగలు, శుభ కార్యాల సందర్భంగా ప్రతి ఒక్కరూ సీట్లతో ఆనందంగా పంచకుంటారు. అటువంటిది ప్రస్తుతం పండుగల సందర్భంగా నగర వాసులకు వివిధ రుచులతో స్వీట్లను అందించేందుకు గానూ 'చెర్రీస్' ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. ముఖ్యంగా దీపావళి పండుగ అంటే ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా చేసుకుంటున్నారు. ఈ దీపావళికి ప్రత్యేకంగా స్వీట్లను తయారుచేసి అందిస్తున్నట్లు చెర్రీస్ మేనేజింగ్ పార్టనర్ తుమ్మల రజనీకాంత్ తెలిపారు. దసరా, దీపావళితో పాటు రానున్న కార్తీక మాసం సందర్భంగా అన్ని రకాల స్వీట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్వీట్లను వినియోగదారులకు తమకు ఇష్టమైన విధంగా అందించడంతో ఫ్యామిలీ ప్యాకింగ్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. డ్రైఫ్రూట్స్ స్వీట్లు, కోవా, నేతిత్లో ,కాజు, బాదాం కలగలుపుతో ప్రత్యేకమైన వెరైటీ స్వీట్లను అందిస్తున్నామని తెలిపారు. సంప్రదాయవంటకాలైన అరిసెలు, లడ్డూలు, జిలేబీలు, జాంగ్రీలు, చక్రాలు, బొబ్బట్లు పూర్తిస్థాయి స్వచ్ఛమైన నేతితో ఇంటిరుచులను కస్టమర్లకు అందిస్తున్నామన్నారు. క్వాలిటీలో రాజీలేదన్నారు. రానున్న క్రిస్మస్, నూతన సంవత్సరం, కార్తీక పౌర్ణమి సందర్భంగా కస్టమర్లకు ఆర్డర్లపై స్వీట్లను తయారుచేసి అందిస్తున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.